ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించాలి

రెబ్బెన, జనవరి 6 : బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను మార్చి 31వ తేదీలోగా అధిగమించాలని సింగరేణి డైరక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టులు) జీ వెంకటేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ మొదట ఖైర్‌గూడ ఓసీపీని సందర్శించి, పని ప్రదేశాలను, అనంతరం వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి ఓసీపీని పరిశీలించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోలేటి భీమన్న క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌ను డైరెక్టర్ పరిశీలించారు. కార్మికులు, కార్మికుల కుటుంబాల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ అద్భుతంగా ఉందని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. సింగరేణిలో వృథా సామగ్రితో పరికరాలు ఏర్పాటు చేసి, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయటం అభినందనీయమని, అందుకు కృషి చేసిన జీఎం, ఖైర్‌గూడ ఈపీ ఆపరేటర్ మురహరిరావును ప్రత్యేకంగా అభినందించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎస్ఈ (సివిల్) మదీన బాషా, సీనియర్ పీవో ప్రశాంత్ పాల్గొన్నారు.

కేకే ఓసీ సందర్శన..

మందమర్రి, జనవరి 6 : మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని జీఎం జీ దేవేందర్‌తో కలిసి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రజెక్ట్) జీ వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించారు. పనిస్థలాలు, ఓసీ మ్యాపులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, సేఫ్టీ ఆఫీసర్ కుష్వా పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

సీసీసీ నస్పూర్, జనవరి 6 : జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రెయినీలుగా ఉద్యోగం సాధించిన వారంతా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి సింగరేణి అభివృద్ధికి కృషిచేయాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. శ్రీరాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రెయినీస్(ఎక్స్‌టర్నల్ బ్యాచ్)కు ఏర్పాటు చేసిన ఇండక్షన్ ట్రెయినింగ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, కేంద్రం మేనేజర్ కల్లూరి వెంకట రామారావు పాల్గొన్నారు.

వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2024-25 వార్షిక క్రీడల్లో విజేతలకు శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వోటూజీఎం సత్యనారాయణ, ఓసీపీ పీవో శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, డీవైపీఎం కాంతారావు, డబ్ల్యూపీఎస్‌జీఏ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, జీఎం చర్చల కమిటీ సభ్యులు చంద్రమోహన్, భద్రి బుచ్చయ్య, కో-ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయించవద్దు

మంచిర్యాల అర్బన్, జనవరి 6 : రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో చైనా మాంజా నిషేధించినట్లు, ఎవరైనా అమ్మినా, ఎవరికైనా ప్రమాదం జరిగినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలుంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా చైనా మాంజ ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యావరణానికి ప్రమాదమని, జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. చైనా మాంజా అమ్మితే ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

ఆదివాసీ పిల్లలు ఉన్నత విద్యనభ్యసించాలి

కాసిపేట, జనవరి 6 : ఆదివాసీ పిల్లలు ఉన్నత విద్యనభ్యసించాలని, ఆ కుటుంబాలకు అండగా ఉంటామని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ స్పష్టం చేశారు. 'పోలీసులు మీ కోసం', కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి పాత తిరుమలాపూర్ ఆదివాసీ గిరిజన గ్రామంలో సోమవారం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీస్ అధికారులు ఆదివాసీ గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గతంతో పోల్చుకుంటే ఎన్నో సౌకర్యాలు మెరుగుపడ్డాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని సూచించారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, జనవరి 6 : మంచిర్యాల జిల్లాలో 9వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో కిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీ-సేవలో నిర్ణీత తేదీల్లో స్లాట్ బుక్ చేసుకొని, నూతన సర్టిఫికెట్, కాల పరిమితి పూర్తి అయిన వారు రెన్యూవల్ కోసం సకాలంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సదరం శిబిరాలకు హాజరు కావాలని సూచించారు. 9, 17, 22, 30 తేదీల్లో శారీరక వికలాంగులు-ఆర్థో (60), 20వ తేదీన మూగ, చెవుడు (50), 24వ తేదీన కంటి చూపు (25), 28వ తేదీన మానసిక వికలాంగుల(50)కు పరీక్షలు చేయనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో, పీఆర్టీయూ నాయకులు

తాండూర్, జనవరి 6 : ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నోటరీ, ఎలాంటి షరతులు లేకుండా సర్టిఫికెట్లు అందజేయాలని పీఆర్టీయూ తాండూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంబరం శ్రీనివాస్, మధుసూదన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాసాడి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయంలో గిర్దావార్ అజాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 6 : వాహనదారులు తప్పరిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని మంచిర్యాల రవాణ శాఖ అధికారులు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఏఎంవీఐ కాశీం సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, జనవరి 6 : చింతలమానేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై ఏఎంవీఐ విక్రమ్ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంఈవో జయరాజ్, పోలీసు కానిస్టేబుల్ రవి, ఇన్‌చార్జి హెచ్ఎం దనిష్ అహ్మద్, ఉపాధ్యాయులు నారాయణ, హరీశ్, వెంకటేశం, విగ్నేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

దండేపల్లి, జనవరి 6 : దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదోతరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవాలని, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం 6 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందని, వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

జైనూర్ : ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కెరమెరి : కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఆధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ కల్వకుంట కవిత
- మెస్రం నీలాబాయి కుటుంబానికి పరామర్శ

జైనూర్, జనవరి 6 : దేవుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ మెస్రం నీలాబాయి కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాధవ్‌తో కలిసి నీలాబాయి కుటుంబాన్ని పరామర్శించారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న తీరుతెన్నులు, ప్రభుత్వం నుంచి ఏమైనా సహాయ సహకారాలు అందాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు, వసతి గృహాల్లో అడపిల్లలకు కనీస రక్షణ కరవైందని ఆరోపించారు. ఫలితంగా వందలాది మంది మహిళలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. నీలాబాయి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేశారు. అంతకుముందు బీఆర్ఎస్ శ్రేణులు జంగాం చౌరస్తా నుంచి బైకు ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా డప్పులు వాయిస్తూ మంగళహారతులతో గ్రామానికి సాదారంగా ఆహ్వానించారు. గ్రామంలోని గోండు మహిళలు ఎమ్మెల్సీ కవితకు తిలకం దిద్ది, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. వారితో కలిసి డప్పు చప్పుళ్ల నడుమ సంప్రదాయ నృత్యాలు చేశారు. కవిత ముందు గ్రామ పటేల్ మెస్రం జంగు సమస్యల ఏకరువు పెట్టారు. గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని, తాగు, సాగునీటి వసతి కల్పించాలని వినతి పత్రం అందించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జామ్ని మాజీ ఎంపీటీసీ, తెలంగాణ ఉద్యమకారుడు లట్పటే మాధవ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కుమ్రం భీం మనువడు కుమ్ర సోనేరావ్, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్ను పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్ కొలాం, ఇచ్చోడ సీనియర్ నాయకులు గాడ్గె సుభాష్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుమ్ర భగవంత్ రావ్, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మడావి భీంరావ్, మాజీ సిర్పూర్(యూ) మండలా అధ్యక్షుడు తొడసం ధర్మరావ్, మాజీ ఎంపీపీ భాగ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగగవంత్‌రావ్, లింగాపూర్ మాజీ జడ్పీటీసీ లక్ష్యా, నాయకులు గణపత్, మార్లావాయి సార్‌మెడి జుగ్నక దేవ్‌రావ్, సర్పంచులు గేడం లక్ష్మణ్, శ్యాంరావ్, మాజీ ఎంపీటీసీ ఆత్రం జుగదిరావ్, నాయకులు పాల్గొన్నారు.

కెరమెరి మీదుగా యాత్ర..

కెరమెరి, జనవరి 6 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన ఓదార్పు యాత్ర కెరమెరి మీదుగా సాగింది. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కెరమెరి చేరుకున్నారు. ముందుగా కెస్లాగూడలో మహిళలు హారతులతో రోడ్డుపైకి రావడంతో ఎమ్మెల్సీ కవిత వాహనం దిగి, ప్రజల వద్దకు వచ్చి కరచాలనం చేశారు. మహిళలు ఆప్యాయతతో తిలకం దిద్ది, శాలువాతో ఘన సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు ఆమెను కలిసేందుకు ఒక్కసారిగా తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మకి దుర్పతాబాయి, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖుత్బొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావ్, నాయకులు షేక్ యునుస్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం..

రెబ్బెన, జనవరి 6 : సింగరేణిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి పూర్వ వైభవం వస్తుందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్మికుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి హాజరయ్యారు. సిరులవేణి సింగరేణి సంస్థను ప్రైవేట్‌పరం కాకుండా కేసీఆర్ అడ్డుకున్నారని గుర్తుచేశారు. సుమారు 20వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. స్థానిక నాయకులతో మమేకమై టీబీజీకేఎస్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అజ్మీరా బాబురావ్, మాజీ సర్పంచ్‌లు పోటు సుమలత, తోట లక్ష్మణ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పర్లపల్లి వనజ, మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, నాయకులు మర్సుకోల సరస్వతి, విజిత్‌రావు, సంపత్, మారిన వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కార్నాథం వెంకటేశం, సత్యనారాయణ, ఓరం కిరణ్ ,దయాకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 6 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిష్కరించడంపై అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టిపెట్టినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్, జనవరి 6 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కారానికి కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల, భీమిని, తాండూర్, మంచిర్యాల, వేమనపల్లి, దండేపల్లి, నస్పూర్ ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందించారు. అధికారులు పాల్గొన్నారు.

నెన్నెల, జనవరి 6 : నెన్నెల మండలం ఆవడం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ ఆవడం ప్రాంత గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 9 గ్రామాలను కలుపుకొని మండలంగా ప్రకటించాలని, ఇందుకు అనువుగా అన్ని వసతులు ఉన్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ తారాచంద్, నాయకులు మల్లేశ్వరి, దుర్గం రవి, ఓదెలు తదితరులున్నారు.

కాసిపేట, జనవరి 6 : దేవాపూర్‌లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్కపురం రమేశ్ కోరారు. ఈ మేరకు కాసిపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీవో సర్ఫర్ అలీకి వినతిపత్రం అందించారు.

కాసిపేట, జనవరి 6 : ఇంటింటా నిర్వహించిన కుటుంబ సర్వేలో చాలా మంది వివరాలు నమోదు కాలేదని, మరోసారి చేయాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీవో సర్ఫర్ అలీకి సర్వీస్ అడ్మైరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బన్న లక్ష్మణ్‌దాస్, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, ఓసీసీ యూనియన్ మాజీ జనరల్ సెక్రటరీ ఏనుగు తిరుపతి రెడ్డి వినతి పత్రం అందించారు.

దండేపల్లి, జనవరి 6 : సివిల్ రైట్స్‌డే కు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలిండియా అంబేద్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ విజయకు ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కోకన్వీనర్ కొల్లూరి రవికుమార్, సురేశ్, దూట సాయికుమార్, వినయ్ ఉన్నారు.

భీమారం, జనవరి 6 : నర్సింగాపూర్ గ్రామంలో అనేక సమస్యలున్నాయని, పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన కాసిపేట రవి ప్రజావాణిలో వినతి పత్రం అందించాడు. మొత్తంగా ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు.

కేంద్రీయ విద్యాలయ పనులు పూర్తి చేయాలి

హాజీపూర్, జనవరి 6 : హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న కేంద్రీయ విద్యాలయం పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ కుమార్ దీపక్ అధికారులు, గుత్తేదారులకు సూచించారు. సోమవారం నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. అధికారులు, గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించనున్నట్లు, క్రీడా రంగంలో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభ చూపేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో మెరవాలి..

నస్పూర్, జనవరి 6 : జిల్లా ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో మెరువాలని కలెక్టర్ అన్నారు. మంచిర్యాలలోని ట్రినిటీ పాఠశాలలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేయిర్ ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనలో 31 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగనున్న రాష్ట్రసాథయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్స్ అవార్డుల ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులు, గైడ్ టీచర్ల బస్సును అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార చేపల విక్రయ వాహనం ప్రారంభం..

ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ముల్కల్ల పంచాయతీ పరిధి వీరాంజనేయ గ్రామ సంఘం రాజరాజేశ్వరి చిన్న సంఘం సభ్యురాలు సుద్దాల విజయ పొందిన సంచార చేపల విక్రయ వాహనాన్ని కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్, డీఆర్డీవో కిషన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల..

ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలకు చెందిన తుది ఓటరు జాబితా విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 3,24,379 మంది పురుషులు, 3,31,756 మంది మహిళలు, 46 మంది ట్రన్స్ జెండర్లు, 39 మంది ఎన్ఆర్ఐలు, 683 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని వివరించారు. తుది ఓటరు జాబితాను జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లంపల్లి, జనవరి 6 : ఇంటిగ్రేటేడ్ మార్కెట్ భవనంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు కలెక్టర్ సూచించారు. మార్కెట్ భవనాన్ని ఆయన సందర్శించారు. ప్లాట్ ఫాంలలో కూరగాయలు విక్రయిస్తున్న తీరును దగ్గరుండి పరిశీలించారు. అలాగే 4వ వార్డులోని డంప్‌యార్డును, కన్నాల గ్రామంలో కొనసాగుతున్న 2.0 అమృత్ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఆపరేషన్ స్మైల్ సమర్థవంతంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 6 : బాల కార్మికుల నిర్మూలన, బాలల సంక్షేమంలో భాగంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 11వ విడుత కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి పోలీస్, రెవెన్యూ, కార్మిక, విద్య, వైద్య శాఖలు, మహిళ-శిశు సంక్షేమ, బాలల పరిరక్షణ, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధులతో ఆపరేషన్ స్మైల్ 11వ విడుత నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు ఎట్టి పరిస్థితుల్లో కార్మికులుగా ఉండకూడదని, ఇటుకల తయారీ పరిశ్రమ, ఇతర పరిశ్రమలు, హోటళ్లు, వ్యవసాయ, ఇతర ఏ రంగంలోనైనా నియమించుకుంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించనున్నట్లు తెలిపారు. సమావేవంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు సజీవన్, బాలల సంరక్షణ అధికారి మహేశ్, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి మండలం సావర్‌ఖేడ్ పంచాయతీ పరిధిలోని ఇందాపూర్‌లోని పోతురాజు ధర్మరాజుల దేవస్థానం జాతర సంబంధిత గోడ ప్రతులను అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, కమిటీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు సిడాం రాజు, సిడాం ధర్ము, సిడాం దేవ్ రావ్, ఆత్రం రాము తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో కుటోడ గ్రామంలోని భీమయ్యక్ ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్‌ను, ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు సిడాం శంకర్, తిరుపతి, జంగు, పావుగ, భీము, రాము, సోము, జైతు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ల వెడల్పు తగ్గింపునకు నిర్ణయం

మంచిర్యాలటౌన్, జనవరి 6 : మంచిర్యాల మున్సిపాలిటీలో ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మిటాకీస్ చౌరస్తా వరకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై నాలుగు చోట్ల నిర్మించిన జంక్షన్ల వెడల్పు తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నది. ఐబీ నుంచి శ్రీనివాస గార్డెన్స్ వరకు ఆరు వరుసల రోడ్డు అభివృద్ధి నేపథ్యంలో నిర్ణయించారు. మంచిర్యాల మున్సిపల్ సమావేశం సోమవారం చైర్మన్